క్లుప్తంగా

మానవ సేవ గొప్ప వరం



తాడేపల్లి రూరల్: నులకపేట చైతన్య తపోవన్‌లో ఏకల్ అభియాన్ విజయవాడ బాగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు చదువు, సేవ, సంస్కారంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య తపోవన్ మాత శివానంద సరస్వతి మాట్లాడుతూ సేవ చేయడం గొప్ప వరమని అన్నారు. ప్రతి ఒక్కరూ క్షమ కలిగి ఉండడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాగ్ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్, సెక్రటరీ శంకరరావు, విజయవాడ బాగ్ ఇన్‌చార్జి వై. మాలతి, మహిళా అధ్యక్షురాలు కె. జ్యోతి, బి. మంగమ్మ, సీహెచ్. ఝాన్సీ, రంగాయమ్మ, సాంబశివరావు, శివ, గోపాలకృష్ణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

తాడికొండ సొసైటీ చైర్మన్‌గా షేక్ నగీనా



తాడికొండ: స్థానిక కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా షేక్ నగీనా బాధ్యతలు చేపట్టారు. జులైతో పాలకవర్గం గడువు ముగియడంతో ప్రత్యేకాధికారిని నియమించారు. తాజాగా త్రిసభ్య కమిటీతో పాలకవర్గాన్ని నియమిస్తూ ఆ శాఖ జీవో విడుదల చేయడంతో షేక్ నగీనా గురువారం సొసైటీ సీఈవో సుజనీ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నగీనా మాట్లాడుతూ సొసైటీలో తొలిసారిగా ఓ మహిళకు, ముస్లిం సామాజిక వర్గానికి ప్రాధాన్యత నిచ్చి తనకు పదవి కేటాయించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం శాయశక్తులా పని చేయడంతో పాటు సకాలంలో రుణాలు, ఎరువులు అందజేసి సొసైటీ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు.

ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం రక్తహీనత నివారణకు గానూ ఆరోగ్య సిబ్బంది ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి ఎస్తేరు రాణి మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రతి గురువారం భోజనం చేసిన తరువాత ఐరన్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే విద్యార్థులకు పింకు, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బ్లూ రంగు మాత్రలు ఆరోగ్య సిబ్బంది మింగిస్తున్నారని చెప్పారు. తగిన ఆహారం తీసుకోవడం ద్వారా కూడా రక్తహీనత నివారించుకోవచ్చని ఆమె సూచించారు.

ఓటు హక్కుతోనే మంచి ప్రభుత్వాల ఎన్నిక

మోతడక(తాడికొండ): ఓటు హక్కు ద్వారానే ప్రజాస్వామ్యంలో మంచి ప్రభుత్వాల్ని ఎన్నుకోవచ్చని తాడికొండ తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు తెలిపారు. మోతడక సీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ద్వారా 254 మంది విద్యార్థుల్ని ఓటర్లుగా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డి. శంకరరావు, వైస్ ప్రిన్సిపాల్ కె. నాగ శ్రీనివాసరావు, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి వి.వి. సుబ్బారావు, ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో జాన్ సైదా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బేతపూడిలో కమ్యూనిటీ హాలు ప్రారంభం



మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో రూ 1.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకుని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వేదికతో పాటు విశ్రాంత రూమ్‌లు, చుట్టూ ప్రహరీ, పచ్చదనంతో పరచుకున్న మొక్కలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ , ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హాజరై ప్రారంభించనున్నారు. ఇళ్లలో చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీ హాల్ నిర్మించి తమ కలను ఎమ్మెల్యే ఆర్కే నిజం చేశారని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ రథసారథి జగనే మళ్లీ సీఎం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో స్పష్టం చేస్తున్న ప్రజలు

మంగళగిరి: సంక్షేమ రథసారథి అయిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలని ప్రజలు స్పష్టం చేశారు. నగరంలోని 7వ సచివాలయంలో గల గుర్రం జాషువా రాజీవ్ సెంటర్ నుంచి గురువారం వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు కావాలంటే) కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ. ఫిరోజ్‌తో పాటు నేతలు పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సంక్షేమ పథకాల బోర్డుల్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుంటేనే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు అందుతాయని తెలిపారు. ప్రజలంతా తిరిగి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని నేతలు కోరారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వలంటీర్లు, సచివాలయ అధికారులు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాల అందజేస్తున్న పాలన రాష్ట్రంలో తొలిసారిగా చూస్తున్నామని తెలిపారు. తమకు ఇంటి వద్దకే పథకాలు అందాలంటే మళ్లీ జగనే రావాలని స్పష్టం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. లక్ష్మీపతిరావు, పార్టీ నాయకులు గూండా మధు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, మలక్‌బాబు, కురగంటి రాజేష్ , సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

చినకాకానిలో...

నగర పరిధిలోని చినకాకాని ఒకటో సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ రూరల్ జేసీఎస్ కన్వీనర్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల్ని వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరలా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే రావాలంటే వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని మరలా సీఎంని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. లక్ష్మీపతిరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుర్రా రాజు, మహిళా కన్వీనర్ చిట్టెమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

శాశ్వత సంక్షేమానికి జగనన్న రావాలి

తాడేపల్లి రూరల్: ప్రజలందరి ఆనందం, సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనన్న సీఎం కావాలని తాడేపల్లి రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి పేర్కొన్నారు. కుంచనపల్లి సచివాలయ పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలోని ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ప్రారంభించారు.



చినకాకాని సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నేతలు



7వ వార్డు సచివాలయంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ, నేతలు

అనంతరం వీఎం రంగా విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఇది శాశ్వతంగా ఉండాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కొండ తవ్వకాల్లో అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు మాట్లాడుతున్నారని, అసలు ఆ పార్టీ అధ్యక్షుని లారీలే మట్టి తోలాయన్న విషయాన్ని గమనించాలని సూచించారు. ఆయన ఆ మట్టిని ఎక్కడ అమ్మారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలో



పొలడుగులో ప్రభుత్వ పథకాలు బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగితే, టీడీపీ నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి అభివృద్ధి శూన్యమని మాట్లాడటం సబబు కాదని హితవు పలికారు. విలీన గ్రామాలను పరిశీలిస్తే గతంలో ఏం అభివృద్ధి జరిగిందో.. ఇప్పుడు ఏం జరిగిందో తెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి గోపాలకృష్ణ, సెక్రటరీ గోపాలరెడ్డి, సచివాలయ అడ్మిన్ బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యుడు అమరా నాగయ్య, కుంచనపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, గృహ సారథులు రాంబాబు, చాగంటి రాజారెడ్డి, సడపర్తి నాగమల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం తాతయ్య, విజయేంద్రరావు, చాగంటి బాపిరెడ్డి, దొంతిరెడ్డి తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిలో.....

జనం బాగు కోసం జగన్ రావాలని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి తెలిపారు. గురువారం బ్రహ్మానందపురం సచివాలయం 7 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి? కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 7వ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చెప్పిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. 7వ సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 15.32 కోట్లను అందజేశారని తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు రూ. 4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సచివాలయ కన్వీనర్లు అడిపి యాకోబు, కూరగంటి హేమలత, మాలపోలు శ్రీకాంత్, సీనియర్ నాయకులు జీలగ పెదగాలయ్య, తాడేపల్లి పట్టణ బూత్ కన్వీనర్ రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ షేక్ జావీద్, స్థానిక నాయకులు అలీ, షేక్ హసీనా, షేక్ జమీర్, గోళ్ల సుందరరావు, పిల్లి యాకోబు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

గ్రామంలోని 2వ సచివాలయ పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ పాల్గొని, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల నమ్మకం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, మరో సారి పేద ప్రజలకు న్యాయం జరిగి వారి జీవితాల్లో మార్పు రావాలంటే ఆయన్ను మనందం ముఖ్యమంత్రిగా గెలిపించాలని తెలిపారు. దుగ్గిరాల గ్రామానికి వివిధ పథకాల ద్వారా రూ. 41.57 కోట్లు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి, ఉప సర్పంచ్ షేక్ నాగుర్, నోడల్ అధికారి పి. శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ సుభాని, పంచాయితీ కార్యదర్శి శరత్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు



దుగ్గిరాల సచివాలయంలో బోర్డును ప్రారంభిస్తున్న నేతలు

ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలి

మేడికొండూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేశారు. మండల పరిధిలోని పాలడుగులో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌కు ప్రభుత్వం అండగా నివాలని కోరారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఇంటికీ ఎంత అభివృద్ధి చేకూరిందో బ్రోచర్లు అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లు, స్థానిక నేతలపై ఉందని తెలిపారు. వలంటీర్లు వా పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, గ్రామ సర్పంచ్ వాడపర్తి భారతి, బి.పెద్ద సాంబయ్య, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, పి.సాయి, షేక్ సుభాని, ఎంపీడీవో ప్రభాకరరావు, ఈవోపీఆర్డీ రవికుమార్, పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన జగన్

తాడికొండ: సంక్షేమంతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన సారథి ఏపీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. తాడికొండ–3 సచివాలయంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న బాబు పేదల్ని గాలికొదిలేశారని విమర్శించారు. తన సామాజిక వర్గం, పెట్టుబడిదారీ, కార్పొరేటు వ్యవస్థల్ని ప్రోత్సహించి ధనిక, పేద అంతరాలను సృష్టించారని ధ్వజమెత్తారు. పేదల్ని అణగదొక్కి కులోన్మాద పోకడలు పోయినందుకే నేడు ఆయనకు ఈ దుస్థితి పట్టిందని తెలిపారు. రెండెకరాల భూమి ఉన్న బాబు వెన్నుపోటు రాజకీయాలతో, నియంత పాలన చేసి సంపాదించిన అవినీతి సొమ్మును కక్కించేందుకు దర్యాప్తు సంస్థలు మరింత లోతైన విచారణ జరిపించాలని కోరారు. బాబుకు బెయిలిస్తే వ్యవస్థలను తప్పుదారి పట్టించి సాక్ష్యాధారాలు మాయం చేసే ప్రమాదం ఉందన్నారు. జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం–3, 4లోని 54 మంది వలంటీర్లకు వైఎస్సార్ సీపీ నాయకులు, దాత బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవో ఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి. శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడికొండ–3 సచివాలయంలో మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

● తుళ్లూరు మండలం పెదపరిమి సచివాలయంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ నాలుగున్నరేళ్ల సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, అవినీతి రహితంగా నేరుగా ఖాతాలకే అందిన సంక్షేమం చూసి దేశంలోని పలు రాష్ట్రాలు విస్మయం చెందుతున్నాయని తెలిపారు. మళ్లీ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడానికి గానూ సీఎంగా వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నంబూరు రఘునాథరావు, కొప్పుల శేషగిరిరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి తెలిపారు.కుంచనపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం స్థానిక నాయకులతో కలసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ గత మూడు, నాలుగు రోజుల నుంచి టీడీపీ, జనసేన నాయకులు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రిగా ఉన్న నారా లోకేష్ ప్రాతినిధ్యం వహించిన మంగళగిరి నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ఆర్కే ఎంత అభివృద్ధి చేశారో టీడీపీ నేతలు గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలని ఆయన తెలిపారు. ఎవరైతే ఎమ్మెల్యే ఆర్కేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారో వారు నడిచే రోడ్డు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేశారని, నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక కమ్యూనిటీ హాళ్లను నిర్మించారని వివరించారు. కుంచనపల్లిలో పేదవర్గాలకు చెందిన ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి కోటి రూపాయలకు పైగా వెచ్చించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రాతూరు అండర్ పాస్ నుంచి నూతక్కి వరకు డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కుంచనపల్లిలో ప్రధాన రహదారిలో రాకపోకలకు కష్టంగా ఉండడంతో అన్ని పార్టీ నాయకులతో మాట్లాడి వారి సొంత భూములను తీసుకుని నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా సభ్యుడు అమరా నాగయ్య, కుంచనపల్లి పార్టీ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం తాతయ్య, బిరుదుగడ్డ విజయేంద్రరావు, తిరుమల రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

ఫిరంగిపురం: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ మందిరంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ వై. యల్లారెడ్డి గురువారం తెలిపారు. అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వ్రతంలో 108 జంటలు పాల్గొంటాయని ఆయన చెప్పారు. ఆ రోజు ఉదయం సాయినాథునికి పంచామృతాలతో స్నపనతో పాటు అష్టోత్తర, సహస్ర నామాలతో పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామని తెలియజేశారు.

గాయపడిన కార్మికుడి మృతి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సచివాలయం ఎదురుగా అనుమతుల్లేకుండా భవన నిర్మాణం జరుగుతున్నా సచివాలయ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. నగర కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె. హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. లక్ష్మీపతిరావు గురువారం భవనాన్ని సందర్శించి అనుమతులు గురించి వివరాలు సేకరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది విధుల నిర్వహణతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని, ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలి

మంగళగిరి: రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించి ప్రతి హెల్త్ సెంటర్ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్(ఎన్కాస్) సర్టిఫికెట్ పొందాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగర పరిధిలోని కాజ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్కాస్ బృందం పర్యటించనున్న నేపథ్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసరాలతో పాటు గదులు, వార్డులు, బాత్ రూమ్‌లు అన్ని శుభ్రంగా ఉండాలని, రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొబీనా, నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నగర పరిధిలోని ఆత్మకూరులో చేపట్టిన డ్రైనేజి నిర్మాణ పనుల్ని వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. ఆత్మకూరు ప్రధాన రోడ్డు అభివృద్ధిలో భాగంగా రూ. 90లక్షలతో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనుల్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బొమ్ము శివరామిరెడ్డి, పాల్గొన్నారు.



కాజలో హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మహాకవి గురజాడకు ఘన నివాళి

తాడేపల్లి రూరల్: మహాకవి గురజాడ వర్ధంతిని గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రచయిత్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కావూరి సత్యవతి పాల్గొన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ ఒకరని తెలిపారు. సమాజంలో పాతుకుపోయిన మూఢాచారాల్ని పారదోలడానికి ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.అందుకు కన్యాశుల్కం నాటకం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయాలు ఉదాహరణగా నిలుస్తాయని తెలిపారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర బాధ్యుడు పి. మురళీకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లి మహిళ కుట్టు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత కోసం ఎంబ్రాయిడరీ శిక్షణ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎంబీవీకే బాధ్యులు పి. విజయ, తాడేపల్లి విజ్ఞాన కేంద్రం బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ బి. ఇంద్రాణి, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, అరవింద, ఉపాధ్యాయులు హనుమంతరావు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రచయిత్రి కావూరి సత్యవతి

అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ భేష్ !

- పీఎంవీవీవై పథకం అమలు అత్యుత్తమం
- యర్రబాలెం వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ అభినందనీయమని కేంద్ర బృందం ప్రశంసించింది. నగర పరిధిలోని యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పరిశీలన బృందం సందర్శించింది. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంవీవీవై) పథక అమలును పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లోని పలు విభాగాల్ని పరిశీలించి రోగులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు పీఎంవీవీఐ పథకం సొమ్ము జమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురికి ప్రత్యక్షంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు ఈశ్వర్ దత్, సుమిత్ కుమార్, డాక్టర్ చిత్ర, కోకిల, రాష్ట్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, యర్రబాలెం హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ బృందంతో ఈమని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

ఈమని పీహెచ్‌సీ సందర్శన

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం పరిశీలించింది. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు తీరుపై పలువురు గర్భిణులతో చర్చించారు. అనంతరం పీఎంఎంవీవై యస్‌వో డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నిధులు పక్కదోవ పట్టకుండా గర్భిణులకు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: కేఎల్ యూనివర్సిటీ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం నగర పరిధిలోని పెదవడ్లపూడి, నూతక్కి, చిర్రావూరు, కొత్తపాలెం ఏరియాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా శివ కల్యాణ మహోత్సవం

మంగళగిరి: స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం(శివాలయం) 53వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అత్యంత వైభవంగా శివ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శివుడు జన్మ నక్షత్రం ఆరుద్ర నాడు ఏటా కల్యాణాన్ని అర్చకులు తెలకదేవరపల్లి శ్యాంసుందరశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, మురళి దంపతులతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ పర్యవేక్షించారు.



కల్యాణ మహోత్సవంలో శివపార్వతులు